క్లుప్తంగా

నేడు పీజీఆర్ఎస్

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నారు. గిరిజనులు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులు తెలిపారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి


నేలమట్టమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

కొమరాడ: రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని దేవుకోన పంచాయతీలో తుపాను వర్షాలకు నష్టపోయిన జీడి, అరటి, మొక్కజొన్న తదితర పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, పంట నష్టం అంచనా వేయాలని, నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందివ్వాలని కోరారు.

గౌరీ పౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


పెద్దూరులో పూజలకు సిద్ధం చేసిన గంగాగౌరీ సమేత నందీశ్వరుని విగ్రహం

గరుగుబిల్లి: గౌరీ పౌర్ణమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, రావివలస, రావుపల్లి, చినగుడబ, గొట్టివలస, కొత్తూరు తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి ఆరంభమయ్యే ఈ వేడుకలకు నందెన్నలు సిద్ధం చేశారు. స్థానికంగానే శివుని సమేత గంగాదేవి, పార్వతీదేవి, వినాయకుడి విగ్రహాలను తయారు చేసి, ప్రదర్శిస్తుంటారు. పంటలు బాగా పండాలని గంగాగౌరీలకు భక్తులు విశేష పూజలు చేస్తారు. గ్రామగ్రామాన వేడుకల సందడి నెలకొంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు


మాట్లాడుతున్న సీపీఐ కార్యవర్గ సభ్యుడు కుమార్, దుర్గారావు

కురుపాం: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు విమర్శించారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యం బారినపడి చనిపోగా ఈ అంశంపై వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో చంద్రబాబు సర్కారు విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని కోరారు.

మీ కోసం వెబ్‌సైట్ ద్వారా పీజీఆర్ఎస్ వివరాల నమోదు

- కలెక్టర్ డా.ఎస్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సరైన వివరాలతో పీజీ ఆర్ఎస్‌కు సమస్యల అర్జీలు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అలాగే పతిరోజూ ప్రజలు తమ సమస్యల వినతులను అందజేసేందుకు కలెక్టరేట్‌లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేక సిబ్బంది ద్వారా పీజీఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు, అంతే కాకుండా ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఫిర్యాదులపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే వచ్చిన అర్జీల వివరాలను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

30 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 30మందికి వైద్య పరీక్షలు చేశారు. పెదపెంకికి చెందిన ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో సత్యసాయి మందిరం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు.


పాలకొండ రూరల్: సింహ వాహనమెక్కి అశేష జనవాహిని నడుమ ముందుకు వెళ్తున్న కోటదుర్గమ్మ


పాలకొండ రూరల్: సింహ వాహనంపై ఊరేగుతున్న దుర్గమ్మ


పాలకొండ రూరల్: ఉత్సవంలో ఆకట్టుకున్న సాముగరిడి విన్యాసాలు


పాలకొండ: అమ్మవారి ఉత్సవ విగ్రహం


పాలకొండ రూరల్: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బేతాళ రూపం

జయహో.. దుర్గమ్మ

- అంగరంగ వైభవంగా కోటదుర్గమ్మ తిరువీధి..
- పాలకొండలో పండగ వాతావరణం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పాలకొండ/పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ తిరువీధి మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల అనంతరం నిర్వహించే ఈ తిరువీధి గురువారం తుఫాన్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసినదే. ఈ మేరకు ఆదివారం సాయంత్రం అమ్మవారి తిరువీధి కొనసాగించారు. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవం విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బళ్ల వేశాలు, కోయిడాన్సలు, సాము గరిడీలు, సరవ డాన్సలు, కోలాటం వంటి ప్రదర్శనలు అలరించాయి. తిరువీధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సుమారుగా 150 మంది పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి బందోబస్తు చేపట్టారు.


పాలకొండ రూరల్: భక్తులను అశీర్వదిస్తున్న దుర్గమ్మ వేషధారిణి


పాలకొండ రూరల్: అమ్మవారి ప్రసాదం రూ.38 వేలకు దక్కించుకున్న కొత్తూరుకు చెందిన గణపతిరావు దంపతులు


పాలకొండ రూరల్: ఆకర్షణీయంగా అష్టాదశ శక్తి రూపాలు



విరిగిన మదుము

ఇటీవల కురిసన భారీ వర్షాలకు కోడిశ – శంభాం వెళ్లే రహదారి మధ్యలో తోరికవలస డౌన్‌లో ఉన్న సీసీ ర్యాంప్ మదుము విరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– సీతంపేట

పర్యాటకుల సందడి

గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ పంచాయతీ, సీహెచ్‌జే భద్రకు వెళ్లే దారిలో మొగనాళి జలపాతం సహా సీతంపేట మండలంలోని మెట్టుగూడ, భామిని మండలంలోని నల్లరాయిగూడ జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో అందరూ పిల్లాపాపలతో వచ్చి సరదాగా గడిపారు. అక్కడే స్నానాలు చేసి, భోజనాలు తిని ప్రకృతి అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. పచ్చని కొండల నడుమ నెలకొన్న ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు.

–గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, భామిని


గుమ్మలక్ష్మీపురం: మొగనాళి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు


సీతంపేట: మెట్టుగూడ జలపాతం వద్ద సందర్శకులు


భామిని: నల్లరాయిగూడ జలపాతం హొయలు

పరామర్శ


కంబగూడలో అంజలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రంజిత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: అనారోగ్యంతో మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అంజలి, కల్పనల కుటుంబాలను గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని కంబగూడ, దండుసూర గ్రామాలకు ఆదివారం వెళ్లి, బాధిత కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం విద్యార్థినుల మరణాలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థులు చనిపోతే ఇంతవరకు గిరిజన ఎమ్మెల్యే గానీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గానీ బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేసి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

కురుపాం: మండలంలోని ఉదయపురం కాలనీలో గోడకూలి చనిపోయిన అరవింద్ కుటుంబాన్ని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, బిడ్డిక రామ్మూర్తిలు పరామర్శించారు. ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తక్షణమే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలి

- వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: పంటల బీమా సొమ్ము చెల్లించకుండా రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు పాడయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులకు పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, మడపాన కేశవ, భార్గవనాయుడు, కాగితాపల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి


వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థులు పి.అంజలి, టి.కల్పనలు అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇదే ఘటనలో పాఠశాల సిబ్బంది, అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిలదీసేందుకు పాఠశాల సందర్శనకు వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలను పాఠశాల లోపలికి అనుమతించకపోవడం సరికాదన్నారు. మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఇటీవల అనారోగ్యం బారినపడిన విద్యార్థినులను పరామర్శించి, వారి అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నాకే అధికార యంత్రాంగం స్పందించిందన్నారు. ప్రస్తుతం అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్‌లో విద్యార్థుల మరణాలు సంభవించకుండా చూడాలన్నారు.

మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు


కాలువ పనులపై ఈఓతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి నీటిపారుదల శాఖ కార్యాలయం వరకు మురుగు కాలువల నిర్మాణానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు పంచాయతీ ఈఓ కోటీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకటరమణ సంబంధిత పనులపై ఆదివారం సమీక్షించారన్నారు. సుమారు 200 మీటర్ల పొడవునా రోడ్డుకిరువైపులా కాలువల పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం టి.చంద్రరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. అండర్ – 14 విభాగంలో డి.సబీర్, ఎస్.జోగేంద్ర.. అండర్ – 17 విభాగంలో ఎం.అగోయో, నవీన్, ఎస్.ప్రసన్న, ఎస్.త్రినాథ్, ఎస్.అఖిల్ ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ గాసయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చనిపోతే గానీ స్పందించరా?

- గురుకుల పాఠశాల విద్యార్థులకు వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యంపై నిలదీస్తున్న తల్లిదండ్రులు


పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి


పాఠశాల ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

కురుపాం:

స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులంతా ఐటీడీఏ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. మొత్తం 611 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పాడై రెండు నెలలు అయింది. అలాగే పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇవన్నీ విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం ఏం చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల పచ్చకామెర్లు బారినపడి మృత్యువాత చెందగా స్పందించిన అధికారులు హుటాహుటిన పాఠశాలను సందర్శించి, హడావిడి చేశారు. విద్యార్థులందరికీ రక్తపరీక్షలు చేయించాలని నిర్ణయించారు. శనివారం ఏపీ గురుకులాల కార్యదర్శి ఎం.గౌతమి పాఠశాలను సందర్శించి, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో పాఠశాల ఆవరణలో ఆదివారం యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. కొత్తగా ఆర్వో ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎవరైనా చనిపోతే గానీ స్పందించరా అని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, వాతావరణం కల్పిస్తే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు కదా అని అంటున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థులందరికీ రక్త పరీక్షలు చేయగా వారిలో 120 మందికి పచ్చకామెర్లు లక్షణాలు బయటపడడంతో 72 మందిని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి, 41 మందికి విశాఖ కేజీహెచ్‌కి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మరో ఏడుగురిని వివిధ మండలాల్లోని ఆస్పత్రుల్లో చేర్పించి, చికిత్స ఇప్పిస్తున్నారు.